ప్రజాశక్తి
బుధవారం 7, జూన్ 2023 5 అనంతపురం



విత్తన నాణ్యతలో రాజీపడొద్దు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ కాయల నాణ్యతలో రాజీపడొద్దని అనంతపురం వ్యవసాయ డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి సూచించారు. మంగళవారం నగరంలోని విజయ ఆగ్రో ఏజెన్సీ, నందీశ్వర సీడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందించే విత్తన వేరుశనగ కాయల విషయంలో ఖచ్చితమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సబ్సిడీ వేరుశనగ కాయలు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఇక నుంచి మరింత జాగ్రత్తగా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎడిఎ రవి, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం



ఆహారపదార్థాల తయారీలో రసాయనాల వాడకం

చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం

పైన పటారం...లోన లోటారం...అన్నచందంగా హిందూపురం పట్టణంలో కొన్ని హోటళ్లు,రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. ఇవి బయట నుంచి చూస్తే బహు ముచ్చటగా కనిపిస్తాయి. అయితే లోపలకి వెళ్లి చూస్తే అసలు విషయం తెలుస్తోంది. నోరూరించే ఆహార పదార్థాల పేరుతో రంగు రంగుల విషం వడ్డిస్తున్నారు. వాటిని తింటే జబ్బులను కొని తెచ్చుకున్నట్లే. విపరీతంగా కల్తీ చేస్తున్నారు. రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన, కుళ్లిన పదార్థాలకు రసాయనాలు, మసాలాలు దట్టించి వడ్డిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీని అరికట్టాల్సిన అధికారులు అటువైపు చూడటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఎప్పుడైన ఎవరైన ఒత్తిడి చేస్తే తూతూ మంత్రంగా తనఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.





హోటల్‌లోని ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీసత్య సాయి జిల్లాలోనే అతి పెద్ద పట్టణం హిందూపురం.వివిధ ప్రాంతాలతో పాటు కర్నాటక నుంచి నుంచి సైతం నిత్యం వేలాది మంది వివిధ పనుల నిమిత్తం హిందూపురం పట్టణానికి వచ్చి వెళుతుంటారు. వీరందరు ఆకలి తీర్చుకోవడానికి హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లకు వెళుతుంటారు. వారు అక్కడ విషపూరితమైన ఆహారం తిని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు తినే ఆహారం కడుపులో రోగాలపుట్టగా మారుతోంది. హోటల్ నిర్వహణకు నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది. అయితే పట్టణంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారు నాణ్యతకు తిలోదకాలిస్తూ కల్తీ పదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గత సంవత్సరం మున్సిపల్ కమిషనర్ ఒత్తిడి మేరకు ఆహార భద్రత అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీస్థాయిలో కల్తీ పదార్థాలు బయటపడ్డాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ లేకుండా తనిఖీల్లో దొరికితే సెక్షన్ 63 ప్రకారం ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5లక్షలు జరిమానా విధిస్తారు. బిర్యానీ సెంటర్‌లో వంటకాల తయారీలో పకృతి సిద్ధమైన రంగులే వాడాలి. వాస్తవానికి అవి ఎక్కడా కనిపించవు. పట్టణంలోని దాదాపు 200 వరకు బిర్యానీ సెంటర్లున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఐదు శాతం సెంటరుల కూడా నిబంధనలు పాటించడం లేదన్నది నగ్నసత్యం.

తూతూ మంత్రంగా తనిఖీలు

హిందూపురం పట్టణంలో రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు, బేకరీలు, చాట్ సెంటర్లు, టీ స్టాళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇలా దాదాపు 500కిపైగా ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. కేవలం మున్సిపల్ శాఖ తరపున ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో కొన్ని మాత్రమే అన్ని నిబంధనలు పాటిస్తున్నాయి. మిగిలిన వారు నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత వరకు ఆహార భద్రత అధికారులు పూర్తి స్థాయిలో తనఖీలు నిర్వహించలేదు. చర్యలు చేపట్టలేదు. సంవత్సరంలో ఒకటి...రెండు సార్లు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారుల చిత్తశుద్ధిపై పలు అరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తాము ఏమి చేసినా ఏలాంటి ఆహార పదార్థాలు వండి వడ్డించిన ఎవరూ తమపై చర్యలు తీసుకోరన్న ధీమాతో వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు తరచూ దాడులు చేస్తే నాణ్యమైన ఆహారం అందుతుందని ప్రజలు అంటున్నారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం

హోటళ్ల లోపల పరిశుభ్రంగా ఉంచాలి. డ్రైనేజీ వసతి బాగుండాలి. వంట వండే వ్యక్తి, వడ్డించే వారు, హోటల్ యజమానికి డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే ఈ నిబంధలు ఎక్కాడా అమలు కావడం లేదు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు మినహాయిస్తే మిగిలిన వాటిలో పరిశుభ్రత పాటించడం లేదు. నాసిరకం కూరగాయలు వాడుతున్నారు. కొన్ని పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి, రెండు మూడు రోజుల తరువాత వండుతున్నట్లు అధికారులు గుర్తించారు. హోటళ్లకు వెళ్లే వారికి టేస్టింగ్ ఫుడ్ పేరుతో టేస్టింగ్ సాల్ట్ (చైనాసాల్ట్) వాడుతున్నారని తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధం. బిర్యాని సెంటర్లలో బిర్యానీ, చికెన్‌కు రంగులు వేస్తున్నట్లు సమాచారం. హిందూపురం పట్టణంలో చాలా హోటళ్లలో ఇలాంటి పరిస్థితి ఉన్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం.

నాణ్యత పాటించకపోతే కేసుల నమోదు



హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లలో నాణ్యమైన ఆహారం అందించకపోతే కేసులు నమోదుచేస్తాం. హిందూపురంలోని కొన్ని బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో వాడిన నూనెతోనే మళ్లీ, మళ్లీ వంటలు వండుతున్నారు. మరికొన్ని చోట్ల రెండు మూడు రోజులు పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టి, అందజేస్తున్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. నిర్వాహకులు తప్పని సరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలి. లేని పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తాం. వ్యాపారులకు ఆన్‌లైన్ విధానంలో ఆహార భద్రతపై శిక్షణ ఇస్తున్నాం. ఆసక్తి గల వారు శిక్షణ పొందవచ్చు.

తస్లీం,
ఫుడ్‌సేఫ్టీ అధికారిణి

బి- ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య బి. చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాలు JNTUA వెబ్ సైట్ http://jntuaresults.ac.inలో చూసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అసంబద్ధాలను తొలగించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల్లో చోటు చేసుకున్న అసంబద్ధాలను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జెఎన్‌టియు సమీపంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లా విద్యా శాఖ అధికారి సాయిరాంను యుటిఎఫ్ నాయకులు కలిసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అనేక తప్పులు చోటు చేసుకున్నాయన్నారు. సోషియల్ స్టడీస్ (కన్నడ మీడియం) సీనియారిటి లిస్ట్‌లో అవకతవకలు జరిగాయని తెలిపారు. డీఎస్సీ 2000కు సంబంధించిన ఎవి.రాధారిణి, ఎస్‌జిటి(కన్నడ), ఎంపియుపిఎస్, ఓబుళాపురం గ్రామం, డీ హీరేహాల్‌ను పొజిషనల్ సీనియారిటీ లిస్ట్‌లో చూపించారన్నారు. అయితే ఫైనల్ సీనియారిటీ లిస్ట్‌లో తనకన్నా జూనియర్ అయిన డీఎస్సీ-2002కు చెందిన గంజి తిప్పేస్వామిని (ఎస్‌జిటి కన్నడ) చూపించారని చెప్పారు. సీనియర్ ఎవి.రాధారాణి అభిప్రాయం తీసుకోకుండా లిస్ట్ నుంచి తొలగించారని అన్నారు. అలాగే బదిలీ ప్రక్రియలో తప్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. బదిలీల సాఫ్ట్‌వేర్‌లో 16-5-2013న ఆ పాఠశాలకు సంబంధించిన స్టేషన్ పాయింట్స్ 30.1230గా చూపిస్తోందన్నారు. 15-5-2013న చేరిన వారికి స్టేషన్ పాయింట్స్ 30.18780గా చూపిస్తోందన్నారు. ఈ సమస్య ఎస్‌జిటి, ఎస్ఎ(టి) ఇతర క్యాడర్‌ల వారికి ఉందని సాఫ్ట్‌వేర్ సమస్యను సరి చేయాలని కోరారు. బదిలీల్లో కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం జరిగిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది పిల్లలు ఉన్న చోట బ్లాక్ చేసి, తక్కువ మంది పిల్లలు ఉన్న చూపించడం జరిగిందన్నారు. దీని వల్ల చాలా మంది విద్యార్థులు సబ్జెక్ట్ టీచర్ లేకపోవడం వల్ల డ్రాపౌట్స్‌గా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఎక్కువ మంది పిల్లలు ఉన్న చోట చూపించి, తక్కువ మంది పిల్లలు ఉన్న చోట బ్లాక్ చేయాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా సరి చేయాలని వారు డిమాండ్ చేశారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇక్బాల్‌కు లైన్‌క్లియర్..?



సిఎం జగన్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు లైన్‌క్లియర్ అయినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ షేక్ మమహ్మద్ ఇక్బాల్‌ను తప్పిస్తారని ఆయన స్థానంలో మంత్రి పెదిరెడ్డి కొత్త వ్యక్తిని తీసుకోస్తున్నారని గత కొంత కాలంగా ఊహగానాలు చెలరేగాయి. వీటిని బలపరిచేలా మంత్రి పెద్దిరెడ్డి చర్చలు కొనసాగాయి. ఆయన హిందూపురం నియోజక వర్గంలోని వైసిపి ముఖ్య నేతలను పిలిపించి పార్టీ కోసం పని చేసేలా ఒప్పించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌తో సైతం చర్చలు జరిపి, కొత్త వ్యక్తిని రంగంలోకి తీసుకోస్తున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. దీంతో ఎమ్మెల్సీ ఇక్బాల్ వర్గం డీలా పడింది. అయినా పట్టుదలతో కొంత మంది నాయకులు ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు ఇక్కడి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి వద్దే ఏదో ఒకటి తేల్చుకోవాలని ఇక్బాల్‌కు సూచించారు. ముఖ్యమంత్రికి తెలియకుండా మంత్రి పెదిరెడ్డి మంత్రాగాన్ని నడుపుతున్నారని వారు ఆరోపించారు. ఆయన రంగంలోకి తీసుకోస్తున్న వ్యక్తికి నియోజకవర్గంలో కనీస స్థాయిలో పట్టులేదని, బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారని వివరించారు. కోట్లాది రూపాయాలు ఖర్చు పెడతారని చెబుతున్నా వారి ఆర్థిక పరిస్థితి అంత బలంగా లేదని వివరించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను ఇక్కడి నుంచి తప్పిస్తే నియోజక వర్గంలో కీలక ఓటు బ్యాంకు అయిన మైనార్టీలు పార్టీకి దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు నిర్ణయించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రిని ఎమ్మెల్సీ ఇక్బాల్ మంగళవారం కలిశారు. ఈసందర్భంగా ఆయన పెద్దిరెడ్డి సమక్షంలోనే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. 'మీరు చెబితే తాను వెళ్లి పోవడానికి సిద్ధమని, కాని మంత్రి రంగంలో దించుతున్న అభ్యర్థి వల్ల ఎలాంటి ప్రయోజనం లేద'ని ఎమ్మెల్సీ నేరుగా ముఖ్యమంత్రికే వివరించినట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో కదిరి నుంచి పోటీ చేస్తారా అని సిఎం ఎమ్మెల్సీని ఈసందర్భంగా అడిగినట్లు తెలిసింది. అయితే నాలుగు

ముఖ్యమంత్రి ఎదుట తేలిన 'పురం' పంచాయితీ

సంవత్సరాలుగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గతంలో ఎప్పుడు లేని విధంగా రికార్డు స్థాయిలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులతో పాటు కౌన్సిలర్లను గెలిపించామని, ఇక్కడి నుంచే పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని ఈసందర్భంగా ఎమ్మెల్సీ ముఖ్యమంత్రిని కోరినట్లు సమాచారం. దీంతో ముఖ్యమంత్రి దీనిపై సుముఖత వ్యకం చేసినట్లు తెలిసింది. తమకు హిందూపురంలో అభ్యర్థిని మార్చాలని ఆలోచన లేదని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోను అవకాశం ఇస్తామని ఇక్బాల్‌కు చెప్పినట్లు సమాచారం. సమావేశం అనంతరం హిందూపురం మాజీ సమన్వయకర్త వేణుగోపాల్ రెడ్డి, చిలమత్తూరు మండల సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి ఇక్బాల్‌కు టికెట్ ఇవ్వాలని లేక పోతే పార్టీ దెబ్బతింటుందని వివరించినట్లు నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి చెప్పిన మాటలతో ఇక్బాల్ వర్గంలో ఆనందోత్సవాలు నెలకొన్నాయి. అదే విధంగా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల విడుదల గురించి చర్చించినట్లు సమాచారం.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఓతూరు పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



భారతీయ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన ఓతురు పరమేష్ ఎన్నికయ్యారు. ఈనెల 5, 6వ తేదీల్లో విశాఖపట్నంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం సందర్భంగా ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఓతురు పరమేష్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థి సమస్యలపై నిర్వహించిన పోరాటాల్లో చురుకైనా పాత్ర పోషించిన పరమేష్‌కు రాష్ట్ర కమిటిలో చోటు లభించడం జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు విపి.సాను, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్న కుమార్, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులకి ధన్యవాదాలు తెలిపారు. తనతో పాటు జిల్లాకు చెందిన ఎస్ఎఫ్ఐ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులుగా రజిత, వైటిసి రమేష్, బంగి శివ, సెంట్రల్ యూనివర్సిటీ నుంచి అనుషద్, అభిరామి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని ఆనందం వ్యక్తం చేశారు.

ఎగ్జిబిషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం



ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ నిబంధనలు పాటించని ఎగ్జిబిషన్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి నరసింహా డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి వ్యాపారమే లక్ష్యంగా ఎగ్జిబిషన్ నిర్వహణ మారిందన్నారు. ముఖ్యంగా వేసవి సెలవులను ఆసరాగా చేసుకుని నగరంలో రుద్రంపేట గుత్తి రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్, వ్యాపార సంస్థలు ఏమాత్రం నిబంధనలు పాటించడం లేదన్నారు. అనుమతులు లేకుండా జాయింట్ వీల్ వంటి వినోద ఐటమ్స్‌ను నడుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఇక వైల్డ్ ఆనిమల్స్‌ను వ్యాపార వస్తువులుగా మార్చి ప్రజల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పాటించని యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోలనలు చేస్తామని హెచ్చరించారు.

ఉల్లాసంగా సమ్మర్‌క్యాంప్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని ఆనందాన్ని పొందుతున్నారు. వివిధ కార్యక్రమాలకు వేదికగా నిలిచిన సమ్మర్ క్యాంప్ మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. మొత్తం 60 మంది హాజరై పలు విభాగాల్లో పాల్గొన్నారు. కథలు చెప్పడం, డ్రాయింగ్, పుస్తక పఠనం, డ్యాన్స్, గేమ్స్ వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలు ఉత్సాహాన్ని చూసి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత ఇలాంటి కార్యక్రమాలు వెలికి తీసేందుకు దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు ఆట పాటలు, డ్రాయింగ్, డ్యాన్స్, యోగా, చెస్, తదితర కార్యక్రమాల్లో పాల్గొనేలా మనం ప్రోత్సహించాలన్నారు. గ్రంధాలయ కార్యదర్శి పి.రమ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌కు పిల్లలు వారి తల్లి తండ్రుల నుంచి విశేష ఆదరణ లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహ్మద్, కావేరి, హేమమాలిని, ఉజ్జనేశ్వరి రీసోర్స్‌పర్సన్ ఎం.వెంకటేషప్ప, సూర్యనారాయణరెడ్డి, ఎం.లక్ష్మి, ఎస్.మహేష్, జ్యోతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంపులో కేరింతలు కొడుతున్న చిన్నారులు



వైద్యాధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆశావర్కర్ల యూనియన్ నాయకురాళ్లు

ఆశావర్కర్లతో నైట్ డ్యూటీలు చేయించొద్దు

యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి

ప్రజాశక్తి-ఉరవకొండ

పిహెచ్‌సిల్లో ఆశావర్కర్లకు సంబంధం లేని నైట్ డ్యూటీలు చేయించొద్దని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి, సిఐటియు జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండల పరిధిలోని గడేహోతూర్ పిహెచ్‌సిలో ఆశావర్కర్లతో నైట్ డ్యూటీలు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆశావర్కర్ల, సిఐటియు యూనియన్ల ఆధ్వర్యంలో పిహెచ్‌సి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైట్‌డ్యూటీలు చేయాల్సిన వైద్యసిబ్బంది పిహెచ్‌సిల్లో ఉండకుండా ఆశావర్కర్లను నైట్‌డ్యూటీలు చేయాలని ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆశావర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకునే విధానాన్ని విడిచిపెట్టకపోతే జిల్లాకేంద్రంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ సంఘం నాయకులు, కార్యకర్తలు, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యూజర్ ఛార్జీల వసూళ్లు పెంచాలి : కమిషనర్ రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

నగరపాలక సంస్థ పరిధిలో యూజర్ ఛార్జీల వసూళ్లలో పురోగతి కనబరచాలని కమిషనర్ రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాలపై పర్యవేక్షణ, ప్రజలకు అందించే సర్వీసులు సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న 74 సచివాలయాల పరిధిలో నోడల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లను నియమించినప్పటికీ యూజర్ ఛార్జీల వసూళ్లలో పురోగతి కొంత వరకూ మాత్రమే కనపడుతోందన్నారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ వారికి కేటాయించిన యూజర్ ఛార్జీల పెంపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, నగర పాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, నగర పాలక సంస్థ ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, డిఇఇలు, టిఎఇలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

శ్రీసాయి లక్కీ క్రియేషన్స్ ప్రొడక్షన్‌లో రెండో సినిమా

నిర్మాత చిందనూరు నాగరాజు



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత చిందనూరు నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీసాయి లక్కీ క్రియేషన్స్ ప్రొడక్షన్‌లో రెండో సినిమాను తీసేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత చిందనూరు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రొడక్షన్‌లో మేన మామకు మేనకోడలిపై ఉన్న విలువలను అత్యంత అద్భుతంగా చూపించి తీసిన శ్రీ రంగాపురం మంచి సక్సెస్‌ను సాధించామన్నారు. తాము తీసే రెండో చిత్రానికి డైరెక్టర్‌గా శివప్రసాద్‌రెడ్డి, ఫైట్ మాస్టర్‌గా అవినాష్, మ్యూజిక్ డైరెక్టర్‌గా మహావీర్ ఎలాందర్, లిరిక్స్ భారతిబాబు, సింగర్లుగా శ్రీకాంత్, నిహాల్, వినయ్‌చంద్ర, జయశ్రీని ఎంచుకున్నట్లు తెలిపారు. ఈవారంలో హైదరాబాద్‌లోని (బిబిఎం) స్టూడియోలో పాటలు అద్భుతంగా వచ్చాయన్నారు. కాగా ఈ చిత్రంలో నూతన నటీనటులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఆడిషన్స్ జరుగుతాయని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ప్రజాశక్తి-గుత్తి

రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యుయేషన్ ఫీజులు తగ్గించాలని గుత్తిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయంలో బైఠాయించి అధికారుల విధులను అడ్డుకున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు తమ ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఎం.వెంకటరామిరెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులు, అధికారులతో చర్చించారు. ఈనెల 12వ తేదీ లోపు సమస్య పరిష్కారమయ్యే వరకు భూముల మార్కెట్ విలువలు పెరిగిన గ్రామాల్లో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయమని సబ్ రిజిస్ట్రార్ గురుప్రసాద్ హామీని ఇచ్చారు. ఫీజులు పెరగని గ్రామాల్లో భూములు, ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

బస్సుఛార్జీలు తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని పిఅండ్ఆర్ ఫర్మ్ ప్రతినిధులు రాజేష్ శేషాద్రి, ప్రతాపరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాయదుర్గం నుంచి అనంతపురం నగరానికి వెళ్లడానికి సాధారణంగా 99 కిలోమీటర్లు ఉండగా అనంతపురంలో టవర్‌క్లాక్ దగ్గరలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టిన సందర్భంగా బస్సులు ప్రత్యామ్నాయ మార్గం గుండా బస్ స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉందన్నారు. దీంతో దాదాపు 14 కిలోమీటర్లు అదనంగా అంటే 99 కిలోమీటర్లకి బదులు 113 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉన్నందున అందుకు తగ్గట్టుగా బస్సు ఛార్జీలను పెంచారు. ఇందుకు ప్రజలు కూడా స్వాగతించి ఇప్పటి వరకు సహకరించారన్నారు. అయితే జూన్ 1వ తేదీ నుండి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు అందుబాటులోకి వచ్చినా ఆదనపు ఛార్జీలను తగ్గించకుండా ప్రయాణికులపై భారం వేయడం బాధాకరమన్నారు. కావున సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని పెంచిన ఛార్జీలను తగ్గించాలని కోరారు.

పంటలబీమా ఇవ్వాలని మంత్రికి వినతి



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలోని రైతులకు పెండింగులో వున్న పంటల బీమాను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకణి గోవర్ధన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో వ్యవసాయ మంత్రి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పెండింగులో ఉన్న బీమా అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2021 సంవత్సరానికి సంబంధించిన ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా అనేక పంటలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే అన్నారు. అయితే మిస్ మ్యాచింగ్, అదర్స్ తదితర సాంకేతిక కారణాల వల్ల చాలామంది రైతులకు పంటల బీమా వారి ఖాతాల్లో జమ కాలేదని చెప్పారు. కావున ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని పెండింగ్ లో రైతుల ఖాతాల్లో వెంటనే పంటల బీమా జమ చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, నాయకులు పెద్దిరెడ్డి, తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ



వడ్డే వెంకటరాముడిని పరామర్శిస్తున్న దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

అనారోగ్యంతో బాధ పడుతూ అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అకులేడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వడ్డే వెంకటరాముడును తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోగుల నాగభూషణం, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, వడ్డే పవన్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



జన్మదిన వేడుకల్లో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి- ఆత్మకూరు

సొంత బిడ్డలా భావించి తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద భారీ కేక్ కోసి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గంతోపాటు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గజమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పూల బొకేలు, పూలహారాలతో ఎమ్మెల్యే గారిని ముంచెత్తారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెళ్లిరోజుతోపాటు



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దంపతులను గజమాలతో సన్మానిస్తున్న వైసిపి నాయకులు, అభిమానులు

ఎమ్మెల్యే దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులతో కేక్ కోయించి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కుటుంబానికి రాజకీయ అండదండలు అందించిన స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు సిఎం జగన్‌ని ఎప్పటికీ మరువలేనన్నారు. అంతేగాకుండా రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం తనని సొంత బిడ్డలా భావించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు, పార్టీ శ్రేణులకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వారి అభివృద్ధి కోసమే వినియోగిస్తానన్నారు. మీ ఆదరణతో 2024లో కూడా మళ్లీ వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చి జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామన్నారు. ఈకార్యక్రమములో జెడ్పీటీసిలు మారుతి, చంద్రకుమార్, నాగార్జున, రాప్తాడు ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, తహశీల్దార్ శ్రీధర్, ఎఒ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో జాగ్రత్త

సవేరా ఆసుపత్రి న్యూరోసర్జన్ రామ్మోహన్ నాయక్



ప్రజాశక్తి-అనంతపురం

బ్రెయిన్ ట్యూమర్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సవీరా ఆసుపత్రి న్యూరోసర్జన్ రామ్మోహన్‌నాయక్ సూచించారు. జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులో ఏవైనా కణాలు అసాధారణ స్థాయిలో పెరగడం చేత కణితులు తయారవుతాయన్నారు. మెదడు క్యాన్సర్ మెదడులోనే తయారై పెరవచ్చు లేదా శరీరంలోని వేరే భాగాల్లో తయారై మెదడుకు సోకవచ్చనఆనరు. వీటిని మోటాస్టాటిక్ క్యాన్సర్ అంటారు. ఈ ట్యూమర్లు అనేవి అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఏ వయసుల వారికైనా రావచ్చన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ కణాలు కొన్ని భాగాల్లో తయారై మెదడుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. అవి ఎముకలు, థైరాయిడ్ గ్రంధి, రొమ్ము క్యాన్సర్, పేగులు, చర్మం, ఊపిరితిత్తులు, కిడ్నీ ద్వారా కూడా రావచ్చన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి లక్షణాలు

తరుచూ తలనొప్పి వచ్చి దాని తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతూ ఉండటం, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తలనొప్పి ఎక్కువగా అవ్వడం, నిద్ర లేచేటప్పుడు వచ్చే తలనొప్పి కొంత ప్రమాదకరంగా మెదడులో కణితికి సంకేతాలు కావచ్చన్నారు. అంతేగాకుండా వాంతులు పగటి కంటే ఉదయం పూట ఉండే ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. అలాగే బ్రెయిన్ ట్యూమర్‌కి మరో లక్షణం ఫిట్స్ రావటం, మూర్ఛ వచ్చి స్పృహ కోల్పోతూ ఉండటం వంటి లక్షణాలు. అలాగే అసంబద్ధంగా నడవటం, ఒకవైపు శరీరంలో బలహీన పడడం జరగవచ్చు. మాటల్లో మార్పు, వాసన, రూచి తెలియకపోవడం, వినికిడి లేదా చూపు మందగించడటం, నడకలో మార్పు రావడం అనే లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం చాలా అవసరం.

ఎలా నిర్ధారిస్తారు..

వైద్యుల దగ్గరికి వెళ్లిన తర్వాత కొన్ని పరీక్షలు చేసి నిర్ధారిస్తారు. తలకు ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ ద్వారా నిర్ధారణ చేయవచ్చు. అలాంటప్పుడు వ్యాధి నిర్ధారణ కొంత వరకు జరిగిన తర్వాత చికిత్స అనేది వివిధ కారణాల వల్ల మారవచ్చు. అది కణితి పరిణామం బట్టి, కణితి ఉన్న ప్రదేశం, రోగి యొక్క సాధారణ ఆరోగ్యం పరిస్థితి బట్టి ఆధారపడి ఉంటుందన్నారు. కణతులను తొలగించడానికి సర్జరీ అవరం అవుతుందన్నారు. శస్త్రచికిత్స చేసి ఆ కణాలను బాయాప్సీ అనే పరీక్షకు పంపుతామన్నారు. బాయాప్సీ ఫలితాలను బట్టి క్యాన్సర్ అని తేలిన తర్వాత కీమోథెరపి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒకవేళా అది బయాప్సీ ప్రకారం క్యాన్సర్ కానీచో వేరే కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరం లేదు. క్యాన్సర్ కణాలు లేని ట్యూమర్ సర్జరీతో పాటు నయం అవుతుందన్నారు.

నేడు వాహనాల వేలం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం వివిధ కేసుల్లో పట్టబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ కె.జనార్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఆధార్ కార్డు, అడ్వాన్స్ రూపంలో నగదు చెల్లించి తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పాల్తూరులో విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కారం

ఉరవకొండ : ఎమ్మెల్సీ శివరామిరెడ్డి చొరవతో విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో నెలకొన్న విద్యుత్, తాగునీటి సమస్యలను ఎట్టకేలకూ అధికారులు పరిష్కరించారు. కొద్దిరోజుల క్రితం కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో పది రోజులుగా గ్రామంలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతోపాటు తాగునీటి సమస్య కూడా తలెత్తింది. ఆయా సమస్యలను స్థానికులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజినీర్, ఎఇలతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతోపాటు తాగునీటి సమస్యలను పరిష్కరించారు. దీంతో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరభద్రస్వామి గర్భగుడిలోకి కుక్కలు

ఆందోళనలో భక్తులు



ఆలయ గర్భగుడిలో తిరుగుతున్న కుక్క

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన ఉండబండ వీరభద్ర స్వామి ఆలయం గర్భగుడిలోకి కుక్కలు చొరబడ్డాయి. దీంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. వీరభద్ర స్వామికి ప్రతి సోమవారంతోపాటు అమావాస్య రోజుల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అలాంటి ఆలయంలోని గర్భగుడిలో కుక్కలు తిరుగుతున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోవడం పట్ల భక్తులో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పదుల సంఖ్యలో ఉన్నా కనీసం ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతోనే ఇలా జరిగిందని చెబుతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖకు సంబంధించిన జిల్లా అధికారులు స్పందించి ఆలయంలోకి కుక్కలు వెళ్లేందుకు కారనమైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఉగ్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలలో బెంగళూరుకు చెందిన సాగిలిటి కంపెనీ మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 28 విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీ బాలాజీ విద్యాసంస్థలు అధినేత పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యతో పాటుగా వారి భవిష్యత్తుకు భరోసా కోసం ఉపాధి అవకాశాలు కళాశాలలోనే ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ ధనుష్, డైట్ కళాశాల వీర, ప్రిన్సిపల్ ప్రకాష్, నియామకాల అధికారులు బాబా, కేశవయ్య, వెంకట్, నరేంద్రరెడ్డి, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డిప్లమా కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ ప్రభుత్వ అధ్యాపకులుగా రెగ్యులరైజేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రవిరాజు, ఎస్.రామాంజినేయులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించనున్నక్యాబినేట్ మంత్రి వర్గం సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాలకు భద్రత కల్పించేలా నిర్ణయాలు చేసి చట్టం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విడిపోయే నాటికి ఉన్న ప్రతి కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలన్నారు. తెలంగాణా ప్రభుత్వం అనుసరించిన నిబంధనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరించి 2014 జూన్ 2 నాటికి ఎంత మంది పని చేస్తున్నారో ఆ కాంట్రాక్ట్ లెక్చరర్‌లందరిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

రహదారుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారుల నిర్మాణానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కౌన్సిలర్ ఎం.సులోచన మంగళవారం భూమిపూజ చేశారు. వార్డులో అభివద్ధి పనుల కోసం రూ.6 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన సిసి రహదారుల నిర్మాణానికి వారు పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ బూత్ కన్వీనర్ ఎం.రంగస్వామి, నాయకులు మల్లికార్జున, షఫీ, మున్సిపల్ సిబ్బంది మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

10న రాతిదూలం పోటీలు

పుట్లూరు : మండల పరిధిలోని సి.వెంకన్నపల్లి గ్రామంలో ఉమామహేశ్వరిస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 10న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, 2వ బహుమతి రూ.40వేలు, 3వ బహుమతి రూ.30వేలు, 4వ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.10వేలు, 6వ బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గెలుపొందని ఎద్దులకు కన్సిలేషన్ బహుమతి రూ.3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 10వతేదీ ఆరు గంటల్లోపు టోకెన్ తీసుకోవాలని కోరారు.

గిరుకుబండి లాగుడు పోటీలు

ఉరవకొండ : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని విడపనకల్ మండల పరిధిలోని ఉండబండ గ్రామ వాలంటీర్ల ఆధ్వర్యంలో గిరుకు బండి లాగుడు పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో తొమ్మిది జతల ఎద్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి పాల్తూరు హరికృష్ణకు చెందిన ఎద్దులు, పల్లె లింగప్పకు చెందిన ఎద్దులు ద్వితీయ స్థానం, ఉరవకొండ రామాంజనేయులు ఎద్దులు తృతీయ స్థానం, పల్లి శ్రీనివాసులు ఎద్దులు నాలుగవ స్థానం, తోట రవిచంద్ర ఎద్దులు 5వ స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామపెద్దలు పశువుల ఓబులప్ప, పశువుల భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ చంద్ర బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు అశోక్, శ్రీధర్, రాము గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హజరత్ ఖాజా బందే నవాజ్ గ్రేసుదాస్ ఉరుసు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కర్నూల్ రోడ్డులో ఉన్న హజరత్ ఖాజా బందే నవాజ్ గ్రేసుదాసు ఉరుసు ఘనంగా జరిగింది. ఉరుసు సందర్భంగా మంగళ వారం గంధంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా గంధంను మేళతాళాలతో గుత్తికోటలోని హజరత్ సయ్యద్ భాషా దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని దర్గాలో చక్కర చదివింపులు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లిములు

చంద్రబాబును జనం నమ్మరు...

కమిట్‌మెంట్‌తో సంక్షేమం, అభివృద్ధి - 'గడప గడపకూ'లో ఎమ్మెల్యేలు అనంత, వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్ని హామీలు ఇచ్చినా టిడిపి అధినేత చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని 5వ డివిజన్‌లో కార్పొరేటర్ జయలలితతో కలిసి మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లుగా సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నీ ప్రస్తుతం తాము అమలు చేస్తున్నామన్నారు. ఇకపోతే అనంతపురంలో తాము చేస్తున్న అభివృద్ధిపై కూడా అవాస్తవ ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు కేవలం మాటలు, గొడవలకే పరిమితం అయ్యారన్నారు. నగరంలో జరుగుతున్న రహదారి విస్తరణకు సంబంధించి గతంలో తాము కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసింటేనే వచ్చిందని మాజీ ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2014లో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కోసం వినతిపత్రం ఇచ్చి.. ఇప్పుడు నగరంలో జరుగుతున్న రోడ్డు తమ వల్లే వచ్చిందని అంటున్నారన్నారు. 2014లో కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చి 2015లో నేషనల్ హైవేగా ఉన్న రోడ్డును ఎందుకు స్టేట్ హైవేగా మార్చారని ప్రశ్నించారు. తెలుగుదేశం హయాంలో మంజూరు చేయించుకుని పూర్తి చేసిన ఒక్క పనీ లేదని విమర్శించారు. సీఎం జగన్ నాయకత్వంలో కమిట్‌మెంట్‌తో తాము కేంద్రం వద్దకు వెళ్లి రోడ్డు పనులు మంజూరు చేయించుకుని పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇకపోతే జనసేన పార్టీకి జెండా, అజెండా లేవన్నారు. పవన్‌కళ్యాణ్‌కు నిలకడ లేదన్నారు. జనసేన స్టీరింగ్ చంద్రబాబు చేతుల్లో ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కడా లేదని, ఇప్పటికే 98.2 శాతం హామీలు అమలు చేశామని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురంలోని అన్ని స్థానాల్లోనూ వైసీపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జెసిఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షుడు శ్రీదేవి, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నాయకులు పెన్నోబులేసు, కుళ్లాయిస్వామి, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గుత్తి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఊటకల్లు గ్రామంలో సర్పంచి ఎ.లహరిరెడ్డి, వైసిపి నాయకుడు ఎ.సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను అడిగి తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు, ఎందుకు అవే పథకాలను ఇస్తానని చెబుతున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పులపాలై దివాలా తీసిందని గగ్గోలు పెట్టినవాడు నేడు అవే పథకాలు తనూ ఇస్తానని గొప్పలు చెప్పుకోవడం బాధాకరమన్నారు. సీఎం జగన్ పథకాలను విమర్శించిన చంద్రబాబు చెప్పినవన్నీ శుద్ధ అబద్ధాలని తేలిపోయిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు, ప్రజలకు అందుతున్న విధానాన్ని గమనించి 2024లో జగనన్నకే ఓటు వేసి మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రామంలో ప్రమాద వశాత్తూ కాలుజారి కింద పడి మంచానికే పరిమితమైన షేక్ బీబీ అనే మహిళను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపిడిఒ చిత్ర శ్రీనివాసులు, ఆర్ఐ సందీప్, వైసిపి సీనియర్ నాయకుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, గురుప్రసాద్ యాదవ్, లాలూనాయక్, కౌన్సిలర్లు వాల్మీకి శివరాం, వరదరాజులు, ఫారూక్, రమణ, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



గుత్తిలో మహిళను సమస్యలను అడిగి తెలుసుకుందున్న ఎమ్మెల్యే వై.విఆర్

పెట్రోల్ దొంగల గుట్టురట్టు

బయటపెట్టిన సీసీ కెమెరాలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని గూగూడు రోడ్డులో వివిధ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద బయటపెట్టిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగలించే వారి గుట్టురట్టు అయింది. ఆదివారం రాత్రి గూగుడు రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ సమీపంలో ముగ్గురు యువకులు దుకాణం బయటపెట్టిన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పెట్రోల్ దొంగతనం చేస్తుండగా అదే సమయంలో బిట్ నిర్వహిస్తున్న పోలీసులు రావడంతో దొంగలు వాహనాన్ని వదిలి పారిపోయారు. దొంగలు వదిలి వెళ్లిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా సీసీ కెమెరాలో ఉన్న దొంగలను గుర్తించాల్సి ఉంది.

రేషన్‌బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజల నుంచి సేకరించి కర్నాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 30 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. సిఎస్‌డిటి శారద తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సాయిప్రసాద్, ఈశ్వరయ్య, సిబ్బంది, బత్తలపల్లి సిఎస్‌డిటి శారద మండల పరిధిలోని సంగాల గ్రామం వెళ్లారు. అక్కడ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న బొలెరో వాహనం నిలిపి ఉండగా తనిఖీ చేయడంతో 30 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం ఉండడంతో ఆ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని సంగాల గ్రామానికి చెందిన నవీన్, లక్ష్మీనారాయణలు ప్రజల నుంచి సేకరించి కర్నాటకలోని బళ్లారి, పావగడకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు వారు తెలిపారు. దాడుల్లో విఆర్ఒ సాకే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మట్టిపరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - అనంతపురం

పంటల సాగు, అధిక దిగుబడి సాధించాలంటే పంటసాగు చేసే పొలం మట్టిపరీక్ష తప్పనిసరి అని వ్యవసాయ పరిశోధకులు ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్కేయూనివర్సిటీ సమీపంలో ఉన్న ఆకుతోటపల్లికి చెందిన ప్రసాద్ పంటలను ఆశించే తెగుళ్లను తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్రం తయారు చేస్తున్నాడు. హైదరాబాదుకు చెందిన బయోటెక్ కిసాన్ హబ్ మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ టెక్నాలజీతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో ఆయన ఈ పనులన్నీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పంటల సాగు, అధిక దిగుబడులు, ఎరువుల వాడకంపై పలు విషయాలను వెల్లడించారు. సేంద్రియ కర్బనం కనీసం 0.75 నుంచి 1.5 శాతం వరకు ఉంటే ఆ నేల సారవంతంగా ఉన్నట్లు అని చెప్పారు. మనం తిన్న ఏ ఆహార పదార్థాలైనా జీర్ణం కావాలంటే మన జీర్ణ వ్యవస్థ బాగుండాలన్నారు. జీర్ణవ్యవస్థ బాగుంటే 90శాతం జబ్బులు దరి చేరవన్నారు. అలాగే మన నేలకు అందించే ఏ రకమైన రసాయన ఎరువులుకానీ, పురుగులమందులు కాని ఆ మొక్క తీసుకొని పంట దిగుబడికి, ఎదుగుదలకు సహకరించలన్నారు. అది జరగాలంటే సేంద్రియ కర్బనం అనేది వ్యవసాయం చేసే ప్రతి నేలలో ఖచ్చితంగా ఉండి తీరాలని



వ్యవసాయ పరిశోధకులు ప్రసాద్

చెప్పారు. ప్రధానంగా మనం వ్యవసాయం చేసే భూమిలో పోషకాలు ఏస్థాయిలో, ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే మట్టి పరీక్ష తప్పనిసరి అన్నారు. వీటి గురించి తెలుసుకున్నప్పుడే ఏ రసాయన మందు ఎంత వాడాలో తెలుస్తుందని చెప్పారు. తగినంత ఎరువులు, మందులు వాడినప్పుడే తెగుళ్ల నివారణ, పంట అధిక దిగుబడి సాధ్యమవుతుందని వివరించారు. అయితే సహజ వ్యవసాయం చేసే రైతులు మట్టి పరీక్ష చేయించుకోవాల్సిన అవసరమే లేదని అన్నారు. వ్యవసాయం చేసే ఏ భూమిలోనైనా మనిషి తినడానికి పనికొచ్చే ఏ ఆహారం అయినా, ధాన్యమైన, కూరగాయలైనా, పండ్లు అయినా పండుతాయన్నారు. అయితే ఏ రైతు అయినా పంటసాగు చేసే విధానం, ఎరువుల వాడకం, నేల స్థితిని బట్టి పంట దిగుబడి ఉంటుందని చెప్పారు. మొక్క పెరుగుదలకు, పండ్లు, ఫలాలు ఇవ్వడానికి వాటి జీవన ప్రక్రియకు తోడ్పడటానికి కొన్ని వందల కోట్ల సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, శిలీంద్రాలతో కూడుకొని ఉన్న ఈ భూమి ప్రతి రైతుకు ఒక అద్భుతమైన వనరు అని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా భూమి లోపల నుంచి వచ్చే వేరు వ్యవస్థపై మొక్క 90 శాతం ఆధారపడి జీవిస్తుందన్నారు. వేరు వ్యవస్థ కాకుండా మిగిలిన భాగమంతా కేవలం 10 శాతం ప్రభావం ఉంటుందన్నారు. ఏ మొక్క అయినా భూమి నుంచి వ్యాపించే తెగుళ్ళు, వైరస్ ద్వారా చనిపోతుందే తప్ప పైన ఆకులను తినే పురుగు, రసం పీల్చే పురుగు, కాయ తొలుచు పురుగు వల్ల చనిపోదన్నారు. మహా అయితే కొంత ప్రభావం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇక శ్వాసక్రియల విషయానికి వస్తే మొక్కలు రెండు రకాల శ్వాసకూరాలు తీసుకుంటాయన్నారు. భూమి లోపల వేరు వ్యవస్థ ఆక్సిజన్ ను తీసుకొని కార్బన్‌డయాక్సైడ్‌ను వదులుతుందన్నారు. అదే విధంగా భూమిపైన ఉండే కొమ్మలు, ఆకులు కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్ ను వదులుతాయన్నారు. ప్రధానంగా వ్యవసాయం చేస్తున్న భూమిలో అత్యంత విలువైన సారవంతమైన మట్టి పైనున్న 6 అంగుళాల పొరమాత్రమే అని దీన్ని జాగ్రత్తగా కాపాడుకోలేకపోతున్నామని అన్నారు. పెద్ద పెద్ద వర్షం చినుకులు నేరుగా భూమి మీద పడినప్పుడు, మనం ఎక్కువగా నీటిని పారించినప్పుడు, బలమైన ట్రాక్టర్ తో సేద్యం చేసినప్పుడు పెద్ద వర్షాల వల్ల నేలపై కొట్టుకుపోవడం వల్ల, సున్నితమైన, సారవంతమైన, మట్టి రేణువులు, కొట్టుకుపోయినప్పుడు నేల సారవంతమైన మట్టిని కోల్పోతుందన్నారు. 30 డిగ్రీల ఎండ దాటితే ఏ సూక్ష్మజీవి కూడా భూమి మీద బతకదని శాస్త్రీయపరంగా నిరూపితమైందని చెప్పారు. మొక్కకు కావలసిన అన్ని రకాల పోషకాలు కన్నా అతి ప్రధానమైన ప్రాణాధారమైన పోషకం సేంద్రీయ కర్బనం అని వివరించారు. దీన్ని పెంచుకోవాలంటే పశువుల ఎరువు, లేదా జీవాల ఎరువు, లేదా కంపోస్టులలో జీవన ఎరువులు అని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్య భూతాపం అని అన్నారు. అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం కొత్తగా వృక్ష సంపద లేకపోవటం వాటిని తొలగించడంతో పాటు ఎక్కువగా రైతులు వాడుతున్న రసాయనాల కారణంగా భూతాపం పెరుగుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 15 రకాల రసాయనాలు వాడని సేంద్రీయ వ్యవసాయ విధానాలు ఉన్నాయని వీటిలో ఏ ఒక్కటైనా ప్రారంభించి వ్యవసాయం చేస్తే ఖచ్చితంగా ఆ నేల అత్యంత సారవంతంగా తయారవుతుందని అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

బత్తలపల్లి : మండలానికి ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన కొత్త అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్ అనంతపురం జిల్లా పరిషత్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడి నుంచి లక్ష్మీకళ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అలాగే మాల్యవంతం పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు చిలమత్తూరు మండలానికి బదిలీ కాగా చిలమత్తూరు మండలం నుంచి వచ్చిన గంగరత్నమ్మ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు ఉన్నతాధికారులను కలిశారు.

డయేరియాపై అవగాహన

ముదిగుబ్బ: మొలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ బి.నాగేంద్రనాయక్ ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అలాగే ఉధృత నీళ్ల విరేచనాల నివారణ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ప్రారంభించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తల్లులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల విరేచనాలు, న్యుమోనియా వల్ల ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు 50 శాతం జరుగుతున్నాయని తెలిపారు. నీళ్ల విరేచనాల వల్ల దుష్పరిణామాలు, వాటిని గుర్తించి నివారణోపాయాలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శైలజ, ఆరోగ్య కార్యకర్తలు హరనాథ్‌రెడ్డి, రాజేశ్వరి, ఎస్.లక్ష్మీదేవి, ఆశా కార్యకర్త గంగాదేవి, 104 సిబ్బంది విష్ణు, డిఈఓ, పైలెట్ ప్రవీణ్, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని 25వ వార్డులోని శాంతినగర్, శివానగర్ ప్రాంతాలకు చెందిన సెక్షన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అందించే సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కాచర్ల కంచన్న, చింతపులుసు పెద్దన్న, రాళ్లపల్లి షరీఫ్, దేవరకొండ రామకృష్ణ, రవి, మారుతీస్వామి, పల్లపు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం కోసం కలెక్టర్‌కు వినతి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం గ్రామస్తులు శ్మశాన వాటిక స్థలాన్ని చూపించాలని కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన నాసిన్ జాతీయ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సర్పంచి గంగులప్ప, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు, పలువురు ప్రజలు విన్నవించారు. గ్రామంలో శ్మశానవాటిక చెరువుకు సంబంధించిన పొలంలో ఉన్నందువల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తక్షణమే శ్మశానవాటిక, పాఠశాల ఆట స్థలముకు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం వారు కలెక్టర్ అరుణ్ బాబుని సన్మానించారు. కార్యక్రమంలో పాలసముద్రం నరసింహులు, గోవిందరెడ్డి, వాలంటరీ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోతుల సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రోడ్డు మార్గాన ముదిగుబ్బ మీదుగా కదిరికి వెళ్తున్న పోతుల సురేష్‌ని మంగళవారం డిష్ వెంకటేష్, కృష్ణం మహేష్ నివాసానికి ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్యుల సంఘం సభ్యులు సూర్యనారాయణ, యువజన సంఘం సభ్యులు కృష్ణం మహేష్ కుమార్ మాట్లాడుతూ పోతుల సునీత రెండో దఫా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడతో ఆర్యవైశ్య సంఘం తరపున సన్మానించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడులు దుర్మార్గం : టిడిపి

పెనుకొండ : ప్రజల్లో టిడిపికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు దాడుల కు పాల్పడడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డికి దళిత ఎమ్మెల్యేలు అంటే గౌరవం లేదన్నారు. ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి అరెస్టు జగన్ ప్రభుత్వం సైకో ఇజానికి నిదర్శనం అన్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో అంగన్వాడీ కార్యకర్త, ఆమె భర్త టిడిపి సానుభూతిపరులు అనే ఉద్దేశతో హనుమాయమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితలే వైసిపికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, సూర్యనారాయణ, త్రివేంద్రనాయుడు, చిన్న పోతన్న, పోతన్న, సుబ్రహ్మణ్యం, వాసుదేవరెడ్డి, బుషప్ప, ఆదినారాయణ, సోము, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : టిడిపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామిపై వైసిపి నాయకుల దాడి హేయమైన చర్య అని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళిత ఎమ్మెల్యేపైనే దాడి చేసి ఆయనపైనే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం జగన్ దళితులపై దాడులు చేయించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు దళితులే ఓటు ద్వారా బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు బుక్కపట్నం శ్రీనివాసులు, గజ్జల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్య రాజ్యమా, ఫ్యాక్షన్ రాజ్యమా అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఎమ్మెల్యే పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. ఆయనకు వైసిపి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశాంత వాతావరణానికి మారుపేరైన కొండపి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యేపై వైసిపి దాడి చేసిందని, నియోజవర్గంలో ఇప్పటికే రెండుసార్లు ఆయనపై దాడికి పాల్పడ్డార న్నారు. ప్రజలు చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

స్థలాలు ఇప్పించండి

పుట్టపర్తి రూరల్ : తమకు కేటాయించిన నివాస స్థలాలను ఇతరులు ఆక్రమించారని వాటిని తిరిగి తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో నక్సలైట్ ఉద్యమంలో, సానుభూతి పరులుగా పని చేసి ప్రభుత్వం ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయామన్నారు. 2014లో ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని దాని ద్వారా కప్పలబండ పొలంలో సర్వే నంబర్-315లో 4.88 ఎకరాల భూమి విక్రయించి అభివృద్ధి చేసుకుని ప్లాట్లు వేసుకుని ఇళ్లు నిర్మిం చుకున్నామన్నారు. అయితే లోచర్ల విజయభాస్కర్ రెడ్డి దౌర్జన్యంగా మా ఇళ్లను కూలగొట్టి ధరణికి సంబంధం లేని వారిని కాలనీలో చేర్చుకున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం తమకు అనుకూలంగా ఆర్డర్ చేసిందన్నారు. కావున ఆ స్థలంలో ఇతరులు ప్రవేశించకుండా సొంతదారులకు పట్టాలు ఇవ్వాలని వారు కలెక్టర్, పోలీసులను పత్రికా ముఖంగా కోరారు.

ఆర్యవైశ్య సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఆర్యవైశ్య సంఘాలను బలోపేతం చేసి ఆర్థికంగా మెరుగుపడేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలని సామాజిక నాయకులు, ఉద్యమకారుడు పోతుల సురేష్ సూచించారు. స్థానిక ఆర్యవైశ్య మందిరంలో మంగళవారం కదిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడా వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన 'ఆత్మీయులకు సత్కారం' కార్యక్రమానికి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐకమత్యమే మహాబలం, మహా బలమే విజయానికి సోపానం, ఇది గమనిస్తే ఎవరైనా అందలం ఎక్కవచ్చన్నారు. అనంతరం కదిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోతుల సురేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవా భారతి అధ్యక్షులు మట్ల చెన్నరాయశెట్టి, అశ్వత్‌శెట్టి, వేణుగోపాల్, చలపతి శెట్టి, జనార్ధన, సత్యనారాయణశర్మ, కదిరి ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, పలు జిల్లాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.